క్లుప్తంగా

రక్తదాన శిబిరం



సంగం : మండలంలోని సిద్ధీపురంలో యువ నేస్తం ఫౌండేషన్ అధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. రెడ్‌క్రాస్ సహకారంతో నిర్వహించిన ఈ శిబిరంలో పలువురు యువత స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేశారు. రక్తదాతలకు రెడ్‌క్రాస్ సర్టిఫికెట్లు అందజేశారు. తొలుత ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గ్రామానికి చెందిన వైద్య విద్యార్థి జీవన్ చంద్రారెడ్డి ఫొటోకు పూలమాల వేసి నివాళులర్పించారు. రక్తదాన మోటివేటర్ మధు, యువ నేస్తం ఫౌండేషన్ నిర్వాహకులు చంద్రకాంత్, నాయబ్‌రసూల్ పాల్గొన్నారు.

దివ్యాంగులకు ట్రైసైకిళ్ల పంపిణీ



ఆత్మకూరురూరల్: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం వద్ద దివ్యాంగులకు ఎలక్ట్రికల్ ట్రైసైకిళ్లను ఆదివారం పంపిణీ చేశారు. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సమకూర్చిన ట్రైసైకిళ్లను ఏఎంసీ మాజీ చైర్మన్ కుడుముల సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో దివ్యాంగులకు అందజేశారు. వీపీఆర్ కార్యాలయ ప్రతినిధి విశ్వం, బీజేపీ నాయకులు కరటంపాటి సుధాకర్, ఏఎంసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కూల్‌డ్రింక్ షాపులో చోరీ



దొంగలు పగులగొట్టిన షాపు పైకప్పు రేకు

కొండాపురం : మండలంలోని భీమవరప్పాడు బస్టాండ్ సెంటర్‌లోని మామిళ్లపల్లి మాధవరావుకు చెందిన కూల్‌డ్రింక్ షాపులో శనివారం రాత్రి గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడారు. షాపు నిర్వాహకుడు రోజులాగే శనివారం రాత్రి 10గంటలకు మూసివేసి ఇంటికి వెళ్లాడు. ఆదివారం ఉదయం 7 గంటలకు షాపు తెరిచిచూడగా పైకప్పు సిమెంట్ రేకులు పగులగొట్టి ఉన్నాయి. షాపులోని రూ.7వేలు నగదు, రూ.18వేల విలువ చేసే కూల్‌డ్రింక్స్ కనిపించలేదు. దీంతో కొండాపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నూతన పెట్రోల్ బంకు ప్రారంభం



అనుమసముద్రంపేట: హసనాపురంలో సంగం-కలిగిరి రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన ఎస్‌వీవీఎస్ హెచ్‌పీసీఎల్ పెట్రోల్ బంకును రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదివారం ప్రారంభించారు. నాణ్యమైన పెట్రోల్, డీజిల్‌ను వినియోగదారులకు అందించాలని పెట్రోల్ బంకు నిర్వాహకులు నూకరాజు వెంగళరెడ్డి, చిన్నపురెడ్డి గోపాల్‌రెడ్డికి మంత్రి సూచించారు. ఎంపీపీ పద్మజారెడ్డి, టీడీపీ మండలాధ్యక్షుడు అబ్బూరి రమేష్‌నాయుడు, బీజేపీ మండలాధ్యక్షుడు చెంచులురెడ్డి పాల్గొన్నారు.

వేడుకగా వసంతోత్సవం

ఉదయగిరిరూరల్: మండలంలోని దేకూరుపల్లిలో జరుగుతున్న సీతారాముల మహోత్సవాలు ఆదివారం రాత్రితో ముగిశాయి. చివరిరోజు వసంతోత్సవం, పారువేటను వేడుకగా నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

పశువులకు వడదెబ్బ ముప్పు

- సంరక్షణ పాటించకపోతే మృత్యువాత పడే అవకాశం
- పాల దిగుబడులపైన ప్రభావం
- అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్న పశువైద్యులు



వడదెబ్బకు గురైన దూడకు వైద్యం చేస్తున్న వైద్యసిబ్బంది

కలిగిరి: ఎండాకాలం పశువులకు గడ్డుకాలం. వేసవిలో మనుషులతో పాటు పశువులు వడదెబ్బకు గురవుతాయి. పశువుల సంరక్షణను నిర్లక్ష్యం చేస్తే వడదెబ్బకు గురై మృత్యువాత పడే ప్రమాదం ఉంది. అధిక ఉష్ణోగ్రతల కారణంగా పాల దిగుబడులు తగ్గిపోయే అవకాశం ఉంది. రైతులు కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకుంటే పాడిపశువులను కాపాడుకోవచ్చునని పశువైద్యులు సూచిస్తున్నారు.

వడదెబ్బ లక్షణాలు

వేసవిలో పశువుల శరీర ఉష్ణోగ్రత కంటే బయట ఉష్ణోగ్రతలు అధికమైనప్పుడు మెదడులో హైపోథలామస్ స్వేదగ్రంథుల నిర్వహణపై పర్యవేక్షణ కోల్పోతాయి. దీంతో చెమట ద్వారా శరీరంలోని ఎలక్ట్రోలైట్స్ కోల్పోయి పశువుల శరీర ప్రక్రియ మందగిస్తుంది. తద్వారా శరీర ఉష్ణోగ్రత పెరుగుతుంది. శ్వాస, గుండె, నాడీవేగం పెరుగుతుంది. మూత్రపిండాలు సరిగా పనిచేయవు. ఫలితంగా పశువులు అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయి శ్వాస ఆడక మరణించే ప్రమాదం ఉంది. వడదెబ్బ తగిలిన పశువుల శరీర ఉష్ణోగ్రత 103 డిగ్రీల కంటే ఎక్కువగా ఉంటుంది. చర్మం గట్టి పడుతుంది. నోటి వెంట సొంగ కారుతుంది. నీడకు చేరి కూలబడుతాయి. శ్వాస పీల్చడం కష్టమవుతుంది. పశువులు క్రమంగా అపస్మారక స్థితికి వెళ్లి మరణిస్తాయి. శరీర ఉష్ణోగ్రతలు 103 నుంచి 109 డిగ్రీలు దాటితే ప్రమాదం ఉంటుంది. వడదెబ్బ ప్రభావంతో చూడి పశువుల్లో గర్భస్రావం సంభవిస్తుంది. దూడలు అతిసార వ్యాధితో మృత్యువాత పడుతాయి.

నివారణ చర్యలు ఇలా..

వేసవిలో మధ్యాహ్నం వేళ పశువులను మేతకు బయటకు వదలరాదు. ఉదయం, సాయంత్రం వేళల్లో వాతావరణం చల్లగా ఉన్నప్పుడు మాత్రమే మేతకు బయటకు తోలాలి. పశువులను ప్రతిరోజూ మూడు, నాలుగు సార్లు చల్లని నీటితో కడగాలి. నాటు జాతి పశువుల కంటే సంకరజాతి పశువులు త్వరగా వడదెబ్బ బారిన పడుతాయి. రేకుల షెడ్లపై గడ్డి లేదా తాటాకులు వేసి మధ్యాహ్నం వేళ నీళ్లతో తడుపుతుండాలి. వడగాలుల ప్రభావం పడకుండా షెడ్డు చుట్టూ గోనె సంచి పరదాలను ఏర్పాటు చేసుకోవాలి.



షెడ్డులో సేదతీరుతున్న పశువులు

ఉదయగిరి నియోజకవర్గంలోని పశుసంపద వివరాలు

తెల్ల పశువులు	నల్ల పశువులు
8322	1,39,156


తగిన చికిత్సతో కాపాడుకోవచ్చు



వడదెబ్బ తగిలిన పశువులను వెంటనే చల్లని ప్రదేశానికి చేర్చాలి. శరీర ఉష్ణోగ్రత సాధారణ స్థితికి వచ్చే వరకు చల్లని నీటితో కడగాలి. వెంటనే పశువైద్యులను సంప్రదించి తగిన చికిత్స అందించడం ద్వారా పశువులను కాపాడుకోవచ్చు.

– సురేష్‌బాబు, ఏడీఏ, ప్రాంతీయపశువైద్యశాల, కలిగిరి

వైభవంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ట



దుత్తలూరు: సోమలరేగడలో నూతనంగా నిర్మించిన సీతారామ మందిరంలో సీతారామలక్ష్మణుల విగ్రహాలు, యంత్ర, గోపుర, శిఖర కలశ, ధ్వజస్తంభ ప్రతిష్టను ఆదివారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం సీతారాముల శాంతి కల్యాణం జరిపారు. సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించారు.

నేడు వెంగమాంబ బ్రహ్మోత్సవాల ఏర్పాట్లకు టెండర్లు

దుత్తలూరు: నరవాడలో వెలసియున్న వెంగమాంబపేరంటాలు బ్రహ్మోత్సవాలు జూన్ 15 నుంచి 19వ తేదీ వరకు జరగనున్నాయి. అందుకు సంబంధించిన ఏర్పాట్లకు బహిరంగ వేలం పాటలు, టెండర్లను ఆలయ ఆవరణంలో సోమవారం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ ఉషశ్రీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుద్దీపాలంకరణ, బాణసంచా కాల్చుట, అలంకరణలకు పూల సరఫరా, వంటసామగ్రి సరఫరా, రోడ్లకు మరమ్మతులు, పారిశుధ్య సిబ్బంది సరఫరా, లడ్డూ ప్రసాదం తయారీ, తాత్కాలిక అంగళ్ల ఏర్పాటు, ఫ్లెక్సీలు, కరపత్రాలు ముద్రణ, రంగులు వేయడం, తదితరాలకు సంబంధించి బహిరంగ వేలంపాటలు, టెండర్లు నిర్వహించనున్నట్లు వివరించారు. ఆసక్తి కలిగిన వారు పాల్గొనాలని కోరారు.

ఈదురుగాలుల బీభత్సం

కొండాపురం : మండలంలో ఆదివారం ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. మధ్యాహ్నం వేళ ఆకాశం మేఘావృతమై ఈదురు గాలులు వీయడంతో సత్యవోలు పంచాయతీ పరిధిలోని లింగన్నపాళెంలో నాలుగు విద్యుత్ స్తంభాలు నెలకొరిగాయి. అలాగే ఇండ్ల మధ్యలో ఉన్న వేపచెట్టు విరిగి పడింది. దీంతో సాయంత్రం వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. విద్యుత్ స్తంభాలు, వేపచెట్టు నెలకొరిగిన సమయంలో ఎవ్వరూ బయటలేక ప్రాణాపాయం తప్పడంతో గ్రామస్తులు ఊపిరిపీల్చుకున్నారు.

పిడుగుపాటుకు కాలిన వేపచెట్టు

ఆత్మకూరు: మండలంలో ఆదివారం సాయంత్రం ఆకాశం మేఘావృతమై ఈదురుగాలులు వీచాయి. దీనికితోడు పలుచోట్ల పిడుగులు పడ్డాయి. నల్లపరెడ్డిపల్లిలో కోనెపల్లి మల్లికార్జున అనే రైతు పొలంలోని వేపచెట్టుపై పిడుగుపడడంతో మంటలు చెలరేగి కాలిపోయింది. ఆ సమయంలో పొలంలో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది.



లింగన్నపాళెంలో నేల కూలిన విద్యుత్ స్తంభం

వేసవి విజ్ఞాన తరగతులు

సోమశిల: అనంతసాగరంలో గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా ఆదివారం పిల్లలతో పుస్తక పఠనం చేయించారు. అనంతరం కథలు చెప్పించారు. బాలబాలికలకు బాల్‌అండ్ బాస్కెట్ ,సినీ పాటలకు నృత్య పోటీలు నిర్వహించినట్లు గంథాలయ అధికారి నారాయణరావు తెలిపారు.

హిందూధర్మ పరిరక్షణ యాత్ర

ఉదయగిరిరూరల్ : హిందూధర్మ పరిరక్షణ యాత్రలో భాగంగా టాబూస్వామి ఆదివారం ఉదయగిరి చేరుకున్నారు. పట్టణంలోని ప్రాచీన దేవాలయాలను సందర్శించారు. స్వామికి విశ్వహిందూ పరిషత్ నాయకులు విప్లవకుమార్ కే శ్రీనివాసులు,గురువయ్య తదితరులు స్వాగతం పలికారు.

విద్యార్థికి అభినందన

ఆత్మకూరు: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి ఒంటేరు సాయిశివ పదో తరగతి ఫలితాల్లో 565 మార్కులు సాధించడంపై పలువురు అభినందించారు. ఆదివారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో అత్యధిక మార్కులు సాధించిన సాయిశివను హెచ్‌ఎం అనంతలక్ష్మి, ఉపాధ్యాయులు, పట్టణానికి చెందిన పలువురు అభినందించారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



సీతారామపురం: మండలంలోని పబ్బులేటిపల్లిలో ప్రకృతి వ్యవసాయంపై ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయం మోడల్ మేకర్ మల్లెల సురేష్ ప్రకృతి వ్యవసాయంపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయంతో తక్కువ పెట్టుబడులతో అధిక దిగుబడులు సాధించవచ్చునని తెలిపారు. ఆరోగ్యకరమైన పోషక విలువలతో కూడిన ఆహారాన్ని పొందవచ్చని వివరించారు. యూనిట్ ఇన్‌చార్జి మాలిబాబు, సిబ్బంది లక్ష్మి, ప్రశాంతి, పద్మ పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా అంకాళమ్మ విగ్రహ ప్రతిష్ట

వరికుంటపాడు: పెద్దిరెడ్డిపల్లిలో అంకాళమ్మ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని ఆదివారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. మంత్రి ఆనం రామానారాయణరెడ్డి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కాకర్ల సురేష్, ఉగ్రనరసింహారెడ్డి, ఎమ్మెల్సీలు బీద రవిచంద్ర, కంచర్ల శ్రీకాంత్, తదితరులు అంకాళమ్మను దర్శించుకున్నారు.

మినరల్ వాటర్‌ప్లాంట్ ప్రారంభం

పెద్దిరెడ్డిపల్లిలో వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన మినరల్ వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభించారు. తొలుత వరికుంటపాడులోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక నేతలు కంభం విజయరామిరెడ్డి, చెంచల బాబుయాదవ్, మన్నేటి వెంకటరెడ్డి, బ్రండ మధుసూదన్‌రావు, నాదెండ్ల రాజేంద్ర, తాటికొండ అనూష పాల్గొన్నారు.



నేత్రపర్వంగా సీతారాముల కల్యాణోత్సవం



కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు



మాంగల్యాన్ని చూపుతున్న వేదపండితుడు

సంగం : మండలంలోని జంగాలకండ్రికలోని కోదండరామస్వామి ఆలయంలో జరుగుతున్న ఉత్సవాల్లో భాగంగా సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని శనివారం రాత్రి నేత్రపర్వంగా నిర్వహించారు. సీతారాముల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి కల్యాణ వేదికపై కొలువు దీర్చి వేదపండితుల వేదమంత్రోచ్ఛరణల నడుమ సంప్రదాయబద్ధంగా కల్యాణాన్ని నిర్వహించారు. భక్తులు సీతారాముల కల్యాణాన్ని తిలకించి తరించారు.

వైభవంగా ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట



ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట



సీతారాముల కల్యాణోత్సవం

జలదంకి: మండలంలోని చింతలపాళెంలో జరుగుతున్న కోదండరామస్వామి ఉత్సవాల్లో భాగంగా ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్టను ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం 6 గంటలకు సుప్రభాతం, పంచామృతాభిషేకం, రత్నన్యాసం, యంత్ర ప్రతిష్ఠ, 8 గంటలకు నిత్య హోమాలు, మహాపూర్ణాహుతి, గోపూజ, గోదర్శనం, ధ్వజారోహణం, కుంభాభిషేకం, తదితర తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటలకు వేదపండితుల మంత్రోచ్ఛరణాలు, మంగళవాయిద్యాలు, భక్తుల కోలాహలం నడుమ సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కావలి, ఉదయగిరి ఎమ్మెల్యేలు దగుమాటి వెంకటకృష్ణారెడ్డి, కాకర్ల సురేష్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కమిటీల నియామకం

ఆత్మకూరు: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆత్మకూరు మున్సిపల్, చేజర్ల మండల కమిటీలను నియమించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ఆదివారం ఒక ప్రకటన విడుదల చేసింది. మున్సిపల్ అభివృద్ధి కమిటీ ఉపాధ్యక్షులుగా షేక్ ముతీవర్, ఆండ్రా సుబ్బారెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా షేక్ మస్తాన్‌వలీ, బీ వెంకటసుబ్బయ్య, కొప్పోలు వెంకటేశ్వర్లు, ట్రెజరర్‌గా మద్దాలి సతీష్, కార్యదర్శులుగా ఎడ్ల విష్ణువర్ధన్, ఎస్ జాన్‌భాస్కర్, సయ్యద్ జమ్రు, మాదాల కృపాకర్, గడ్డం దిలీప్‌ను నియమించారు. మున్సిపల్ కమిటీ ఎగ్జిక్యూటీవ్ మెంబర్లుగా ఎం బ్రహ్మానాయుడు, కల్లగుంట నరసింహారెడ్డి, షేక్ షారూక్, సన్నపురెడ్డి వెంకటేశ్వర్లురెడ్డి, జనార్దన్‌రెడ్డి, తన్నీరు సురేంద్ర, బత్తిన నారాయణరెడ్డి, గీతాల మల్లి, ఎం శ్రీనివాసులు, వేము బాలచెన్నయ్య, షేక్ ఖాజావలీ, సయ్యద్ ఖాదర్ మస్తాన్, యర్రగుంట్ల మల్లికార్జున, బంకా వెంకటేశ్వర్లురెడ్డి, యాకసిరి కొండయ్య నియమితులయ్యారు.

- చేజర్ల మండల వైఎస్సార్‌సీపీ ఉపాధ్యక్షులుగా జీ కృష్ణారెడ్డి, గోతం వెంకటసుబ్బయ్య, ప్రధాన కార్యదర్శులుగా తేళ్ల శేఖర్‌రెడ్డి, నోటి సుందరరామిరెడ్డి, కోవి వెంకటేశ్వర్లునాయుడును నియమించారు. ట్రెజరర్‌గా పీ చంద్రశేఖర్‌రెడ్డి, కార్యదర్శులుగా ఎంపీ రత్నంనాయుడు, నాగా నాగిరెడ్డి, ఉడతా పుల్లయ్య, చీర్ల శ్రీనివాసులు, టీ వెంకటకృష్ణ, ఎగ్జిక్యూటీవ్ మెంబర్లుగా అల్లంపాటి చిరంజీవిరెడ్డి, ఏ వీరాస్వామి, కే వెంకటరెడ్డి, సయ్యద్ ఆజ్మీర్, టీ సురేష్‌రెడ్డి, కొప్పాల శ్రీనివాసులునాయుడు, వెన్నపూస వెంగళరెడ్డి, ఉడతా చిన్నరత్నయ్య, పఠాన్ రసూల్, బీ రామచంద్రయ్య, గంగవరపు సుధాకర్‌రెడ్డి, మాతంగి వంశీ, ఎం శ్రీకాంత్‌యాదవ్, పీ శేఖరయ్య, బీ పెంచలనారాయణరెడ్డి నియమితులయ్యారు.

పోలీసు అదుపులో జేబుదొంగ

వరికుంటపాడు: మండలంలోని ధర్మవరంలో ఆదివారం ఓ జేబు దొంగను పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. టీడీపీ కార్యక్రమంలో పాల్గొనేందుకు మంత్రి ఆనం రామానారాయణరెడ్డి, ఎంపీ వేమిరెడ్డి తదితరులు ర్యాలీగా వస్తున్న క్రమంలో ఉదయగిరికి చెందిన మట్ల లక్ష్మయ్య జేబులో నుంచి రూ.20వేలు నగదును దొంగ తస్కరించాడు. వెంటనే గమనించిన బాధితుడు దొంగను పట్టుకుని నగదును తీసుకుని పోలీసులకు అప్పగించారు. దొంగను స్టేషన్‌కు తరలించి విచారిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



దొంగను అదుపులోకి తీసుకున్న పోలీసు

రాజకీయ ధీశాలి కలికి

- నేడు 19వ వర్ధంతి



కలికి యానాదిరెడ్డి(ఫైల్)

కావలి: కావలి రాజకీయాల్లో నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన, మంత్రి పదవిని అలంకరించిన రాజకీయయోధుడు, గ్రామాల్లో కరెంట్ వెలుగులు ప్రసరింపజేసిన పేదల పక్షపాతి స్వర్గీయ కలికి యానాదిరెడ్డి. 1968లో జలదంకి మండలం జమ్మలపాళెం సర్పంచ్‌గా తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన కలికి 30 ఏళ్ల పాటు కావలి రాజకీయాల్లో అత్యంత బలమైన శక్తిగా వెలుగొందారు. సర్పంచ్‌గా ఎన్నికైన రెండేళ్లకే 1970లో రాజకీయ హేమాహేమీలను వెనక్కునెట్టి కావలి సమితి అధ్యక్షుడిగా గెలుపొందారు. 1972లో కావలి ఎమ్మెల్యేగా ఇండిపెండెంట్‌గా గెలుపొందిన గొట్టిపాటి కొండపనాయుడుతో వచ్చిన విభేదాలను కలికి తన రాజకీయ ఎదుగుదలకు వ్యూహాత్మకంగా వినియోగించుకున్నారు. అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి జలగం వెంగళరావుతో సన్నిహిత సంబంధాలు పెట్టుకుని స్థానిక ఎమ్మెల్యే గొట్టిపాటికి ధీటైన ప్రత్యర్థిగా నియోజకవర్గ స్థాయి నాయకుడిగా బలపడ్డారు. అనంతరం 1978లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొంది తొలిసారిగా ఎమ్మెల్యే అయ్యారు. వరుసగా 1985,1989,1994లో ఎమ్మెల్యేగా గెలపొందారు. ఆయన హ్యాట్రిక్ రికార్డును ఇంత వరకు ఎవరూ అధిగమించకపోవడం విశేషం. కాగా 1993లో కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా సహకార, దేవాదాయ శాఖల మంత్రిగా కలికి పనిచేశారు. కాగా కలికికి సంతానం లేరు. ఆయన తన బంధువులను రాజకీయాల్లో ప్రోత్సహించలేదు. కొత్తవారినే రాజకీయాల్లోకి తీసుకొచ్చి గుర్తింపునిచ్చారు. కాలగమనంలో కలికి ప్రాపకంతో రాజకీయంగా, ఆర్థికంగా బలపడిన వారెవ్వరూ కూడా ఆయన్ని మననం చేసుకోవడం మర్చిపోయారు. అయితే కలికికి బంధువైన కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి అంటే ప్రత్యేకమైన అభిమానం, నమ్మకం. ఆయన ఆధ్వర్యంలోనే ఏటా మే 5న కలికి వర్ధంతిని కావలిలో నిర్వహిస్తుంటారు. సోమవారం కూడా ఉదయగిరి బ్రిడ్జి సెంటర్ కూడలిలోని కలికి విగ్రహం వద్ద వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కలికి అభిమానుల ప్రతినిధి కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి తెలిపారు. కలికి విగ్రహానికి నివాళులర్పించి అన్నదానం నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

గిరిజలం.. అమృతం



కొండపై నుంచి కాలువ ద్వారా వచ్చే నీటిని పట్టుకుంటున్న మహిళ

ఉదయగిరి దుర్గంపై నుంచి జాలువారే జలాన్ని పట్టణ వాసులు అమృతంలా భావిస్తూ కొన్నేళ్లుగా తాగేందుకు వినియోగిస్తున్నారు. చారిత్రక నేపథ్యం కలిగిన ఉదయగిరి దుర్గంపై మూడు వేల రకాల ఆయుర్వేద మొక్కలు ఉన్నట్లు చారిత్రక ఆధారాలు ఉన్నాయి. ఈ ఔషధ గుణాలు కలిగిన మొక్కలను తాకుతూ దిగువకు వచ్చే జలం ఎంతో రుచిగా ఉంటుంది. అందుకే ఈ నీటిని తాగేందుకు నేటికి స్థానికులు ఆసక్తి చూపుతున్నారు.

–ఉదయగిరి

ప్రమాదభరితంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు



ఆదివారం విద్యుత్ షాక్‌తో మృతి చెందిన మేక

అనంతసాగరం మండలం పాతాళపల్లిలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదభరితంగా ఉన్నాయి. గతంలో సోమశిల ఉత్తరకాలువ సమీపంలో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల కోసం రెండు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశారు. ఇటీవల ఉత్తర కాలువ విస్తరణ పనులు చేపట్టిన క్రమంలో ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ మట్టినిపోశారు. దీంతో ట్రాన్స్‌ఫార్మర్లు నేలమట్టానికి చేరడం, వాటి చుట్టూ ఎలాంటి రక్షణ కంచె లేకపోవడంతో అటుగా మేతకు వెళ్లిన పశువులు, మేకలు షాక్ కొట్టి మృత్యువాత పడుతున్నాయి. ఇటీవల కాలంలో రెండు మేకలు మృతి చెందగా, తాజాగా ఆదివారం మరో మేక మృత్యువాత పడింది. ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ రక్షణ కంచె ఏర్పాటు చేయాలని పలుమార్లు విద్యుత్ శాఖ అధికారులకు విన్నవించినా ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి రక్షణ కంచె ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.

–సోమశిల

నిర్లక్ష్యపు తుప్పు



వరికుంటపాడు ఎంపీడీఓ కార్యాలయంలో తుప్పు పడుతున్న చువ్వ

గత ప్రభుత్వ హయాంలో 2024 ఫిబ్రవరిలో జగనన్న కాలనీల్లోని గృహ లబ్ధిదారులకు పంపిణీ చేసే నిమిత్తం వింజమూరు, వరికుంటపాడు మండలాలకు చువ్వను సరఫరా చేశారు. అంతలో సార్వత్రిక ఎన్నికలు రావడంతో అధికారులు పంపిణీ చేయలేదు. కొత్త ప్రభుత్వం కొలువుతీరి నెలలు గడుస్తున్నా లబ్ధిదారులకు చువ్వను పంపిణీ చేయడంపై అధికారులు దృష్టి సారించలేదు. దీంతో లక్షలాది రూపాయల విలువ చేసే చువ్వ తుప్పుపట్టి నిరుపయోగంగా మారింది. మండల పరిషత్ కార్యాలయాల వద్ద తుప్పుపట్టిన చువ్వను గమనించిన పలువురు ప్రజాధనం అంటే నిర్లక్ష్యమా అని అధికారుల తీరుపై చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చువ్వను గృహ లబ్ధిదారులకు పంపిణీ చేయాలని పలువురు కోరుతున్నారు.

–ఉదయగిరి